క్లుప్తంగా

నూతన కమిటీ ఎన్నిక



అధ్యక్ష, కార్యదర్శులను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

ఖమ్మంఅర్బన్/ఖమ్మంమామిళ్లగూడెం: ఖమ్మం రోటరీనగర్‌లోని సిద్ధేశ్వరి పీఠ పాలిత రాజరాజేశ్వరి దేవి సమేత శ్రీ భోగలింగేశ్వర స్వామి వారి ఆలయానికి నూతన అభివృద్ధి కమిటీ ఏర్పడింది. కమిటీ చైర్మన్‌గా రాయి వెంకటప్పయ్య, కార్యదర్శిగా చిత్తారు సింహాద్రి యాదవ్ ఎన్నికయ్యారు. అలాగే, సభ్యులుగా వీ.జీ.కే.మూర్తి, బీ.హెచ్.కిషోర్ కుమార్, పొదిల పాపారావు, బండ్ల నరసింహారావు, బీమా సత్యం, చల్ల జయారెడ్డి, తంగేళ్ల సింహాద్రి, అక్కినేని దశరథరామయ్య, పోలూరి సుజాతలను ఎన్నుకున్నారు. కమిటీని బీజేపీ నాయకులు శనివారం సన్మానించారు.

9 లోగా దరఖాస్తు చేసుకోండి

ఖమ్మం అర్బన్: నగరంలోని వెలుగుమట్ల కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో హెడ్ కుక్ పోస్టు కోసం మహిళల నుంచి కాంట్రాక్ట్ ప్రాతిపదికన దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఖమ్మం అర్బన్ ఎంఈఓ శైలజాలక్ష్మి తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 7 నుంచి 9 వరకు వెలుగుమట్ల కేజీబీవీలో దరఖాస్తులు సమర్పించాలన్నారు. అభ్యర్థుల వయస్సు ఈఏడాది ఆగస్టు 1 నాటికి 18 నుంచి 45 ఏళ్ల మధ్య ఉండాలని, పదో తరగతి ఉత్తీర్ణతతో పాటు వంటలో అనుభవం, స్థానికులై ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తుతో పాటు సర్టిఫికెట్లు సమర్పించాలన్నారు.


'లంబాడీలు ఎస్టీ జాబితాలో ఉండడం చట్టబద్ధమే'

కూసుమంచి: తెలంగాణలో లంబాడీలను ఎస్టీ జాబితాలో ఉండడం చట్టబద్ధమేనని, వారికి మంత్రి పదవి ఇవ్వకుండా చేస్తున్న కుట్రలకు త్వరలో తగిన గుణపాఠం చెబుతామని మాజీ ఎంపీటీసీ సభ్యుడు, లంబాడ వేదిక రాష్ట్ర నాయకుడు జర్పుల బాలాజీ నాయక్ అన్నారు. శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అన్నదమ్ముల్లా ప్రశాంతంగా ఉన్న గిరిజన తెగల మధ్య ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, మాజీ ఎంపీ సోయం బాపూరావు రాజకీయ లబ్ధికోసం చిచ్చు పెడుతున్నారని, లంబాడీలకు మంత్రి పదవులు దక్కకుండా కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. లంబాడీలను ఎస్టీ జాబితాలో చేర్చుతూ నాటి ఇందిరాగాంధీ హయాంలో రాష్ట్రపతి ఆమోదముద్రతో చట్టబద్ధత కల్పించారని గుర్తు చేశారు. రాష్ట్రంలో 70 నియోజకవర్గాల్లో గెలుపోటములు నిర్ణయించే సత్తా లంబాడీలకు ఉన్నందున అన్ని రాజకీయ పార్టీలు తమ వైఖరిని వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచ్ వడిత్య రామ్మూర్తి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీ ముసాయిదా విడుదల

నేలకొండపల్లి: మండలంలోని మండల ప్రాదేశిక నియోజకవర్గాల ముసాయిదా జాబితాను శనివారం అధికారులు విడుదల చేశారు. మండలంలోని 18 ఎంపీటీసీలకు సంబంధించిన ముసాయిదాను ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఆయా జీపీల్లో ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాలను విడుదల చేశారు. వీటిపై అభ్యంతరాలు ఉంటే ఈనెల 8 వరకు స్వీకరించి 9న పరిశీలించాక 10న తుది జాబితాను విడుదల చేయనున్నారు. ముసాయిదా జాబితాలను ఎంపీడీఓ ఎం.యర్రయ్య, మండల పంచాయతీ అధికారి శివలు పర్యవేక్షించారు.

గుంతల పూడ్చివేత



గుంతలు పూడుస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఖమ్మం రాపర్తినగర్: నగరంలోని మయూరిసెంటర్ నుంచి రాపర్తినగర్ వెళ్లే రహదారిలో డివైడర్ల మధ్యలో ఏర్పడిన గుంతలను మట్టితో పూడ్చారు. గతంలో ఇక్కడ డివైడర్లు ఉండగా.. ట్రాఫిక్ ఎక్కువగా ఉండడంతో రహదారి సౌకర్యం కోసం వాటిని తొలగించారు. అయితే మధ్యలో ఏర్పడిన గుంతలు అలాగే ఉండడంతో శుక్రవారం రాత్రి ఎట్టకేలకు మున్సిపల్ సిబ్బంది మట్టితో పూడ్చారు.

నగరంలో సినిమాలు

తిరుమల	ఘాటి
వినోద	కొత్త లోక, మహావతార్ నరసింహా
సాయిరాం	మదరాసి
ఆదిత్య	ద కంజూరింగ్: లాస్ట్ రైట్స్
శ్రీనివాస	లిటిల్ హార్ట్స్, వార్2

- ఖమ్మంగాంధీచౌక్

వినాయకా.. వీడ్కోలిక..



వినాయక నవరాత్రోత్సవాలను పురస్కరించుకొని తొమ్మిది రోజుల పాటు విశేష పూజలు అందుకున్న గణనాథులకు భక్తులు శనివారం ఘనంగా వీడ్కోలు పలికారు. భాజా భజంత్రీలు, డీజే చప్పుళ్లు, మహిళల కోలాటాలు, నృత్యాలతో ఘనంగా సాగనంపారు. జై బోలో గణేశ్ మహరాజ్‌కి జై అంటూ చెరువుల్లో నిమజ్జనం చేశారు. ఈ వేడుకల్లో ఎలాంటి అపశ్రుతి జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యాన అన్నదానం, మజ్జిగ, పులిహోర, తాగునీటి వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. లడ్డూవేలం పాటలు హోరాహోరీగా సాగాయి.

– సాక్షి నెట్‌వర్క్



ఖమ్మంమయూరిసెంటర్: 16వ డివిజన్ కొత్తూరులో దప్పుచప్పుళ్లు..



గాంధీచౌక్‌లో నిమజ్జనానికి బారులుదీరిన వినాయక విగ్రహాలు



ఖమ్మంరూరల్: నాయుడుపేట వద్ద మున్నేటిలో నిమజ్జనం చేస్తున్న తుంబూరు దయాకర్‌రెడ్డి



తిరుమలాయపాలెం: పిండిప్రోలు ఊరేగింపులో మహిళల నృత్యాలు



ఖమ్మంగాంధీచౌక్: భక్తులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న గన్నీస్ మర్చంట్స్ ప్రతినిధులు



పెద్దతండాలోని తాడ్‌మిల్ సెంటర్ వద్ద..



నేలకొండపల్లిలో కమిటీ సభ్యుల సంబరాలు



బ్యాంక్ కాలనీలో..



దేవతామూర్తుల వేషధారణలో బుడిగజంగాల కాలనీవాసులు



ఖమ్మంలో కొమ్ముకోయ నృత్యాలు



రఘునాథపాలెం: కోటపాడులో భక్తులతో కలిసి కోలాటం ఆడుతున్న ఏఎస్ఐ వెంకటేశ్వర్లు



మున్నేరులో ఎన్డీఆర్ఎఫ్ టీం పహారా



ఖమ్మంఅర్బన్: రూ.40,116లకు దక్కించుకున్న ఇందిరానగర్ బాలగణపతి ఆలయ లడ్డూతో భక్తుడు, ఆలయ నిర్వాహకులు



ఖమ్మంరూరల్: ఏదులాపురం మున్సిపాలిటీ సింహాద్రినగర్‌లో రూ.35,600కు లడ్డూ దక్కించుకున్న రుత్విక్



కామేపల్లి: పండితాపురంలో మూడుచోట్ల జరిగిన వేలంలో రూ.10వేలు, రూ.5వేలు, రూ.5వేల చొప్పున లడ్డూను దక్కించుకున్న షేక్ రబ్బానిపాషా



కామేపల్లిలో నిమజ్జన వేడుకల్లో పాల్గొన్న భక్తులు



ఖమ్మం జయనగర్‌కాలనీలో..



ఖమ్మంలో కేరింతలు కొడుతున్న భక్తులు

గణనాథుని ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షం



గణనాథునికి పూలు చల్లుతున్న మంత్రి తుమ్మల

ఖమ్మంగాంధీచౌక్: రాష్ట్రంలో జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నిలుస్తుందని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. నగరంలో శనివారం నిర్వహించిన గణనాథుల శోభాయాత్రకు గాంధీచౌక్‌లో స్తంభాద్రి ఉత్సవ సమితీ ఆధ్వర్యాన నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గణనాథుని ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షంగా ఉందని, సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వాన రాష్ట్రం అభివృద్ధి పథంలో నిలుస్తుందన్నారు. మున్నేరు వరద ఇబ్బందులను అధిగమించేందుకు కేబుల్ బ్రిడ్జి, రిటైనింగ్ వాల్స్, రోప్‌వేలు వంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. అనంతరం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ మాట్లాడగా.. నగర మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, స్తంభాద్రి ఉత్సవ సమితి అధ్యక్షుడు వినోద్ లాహోటీలతో పాటు కీసర జయపాల్‌రెడ్డి, వెంపటి లక్ష్మీనారాయణ, గెంటేల విద్యాసాగర్, ప్రసన్న కృష్ణ, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి తుమ్మలకు వినతి

ఖమ్మంఅర్బన్: నగరంలోని 16వ డివిజన్ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై కార్పొరేటర్ మేడారపు వెంకటేశ్వర్లు శనివారం డివిజన్ పరిధిలో పర్యటనకు వచ్చిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు స్థానికులతో కలిసి వినతిపత్రం అందించారు. మున్నేరు కరకట్టను ధంసలాపురం వరకు పొడిగించి పాత కాలనీ, కొత్త కాలనీ, ధంసలాపురం ప్రాంతాలను వరద ముప్పు నుంచి రక్షించాలని, అగ్రహారం రైల్వే అండర్ బ్రిడ్జి పనులను త్వరగా పూర్తి చేయాలని కోరారు. డివిజన్ పరిధిలో మిగిలిన సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, పైపు లైన్ పనులను త్వరగా చేపట్టాలని వినతిలో పేర్కొన్నారు.

నేడు సీసీఏ ఆధ్వర్యాన సెమినార్

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో ఆదివారం సాయంత్రం 'ఎన్నికల సంఘం ఎవరి పక్షం..? ప్రక్షాళన ప్రారంభం ఎక్కడ' అనే అంశంపై సెమినార్ నిర్వహిస్తున్నట్లు ప్రత్యామ్నాయ పౌర సమూహం (సీసీఏ) ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సెమినార్‌కు ప్రధానవక్తగా ప్రముఖ రాజకీయ విశ్లేషకులు పరకాల ప్రభాకర్ హాజరవుతారని తెలిపారు. ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



తిరుమలాయపాలెం: ఉత్తమ హెచ్‌ఎంగా ఎంపికైన జల్లెపల్లి హెచ్‌ఎం దారా రాజేష్



ఉత్తమ తెలుగు ఉపాధ్యాయురాలిగా ఎంపికైన చింతపల్లి రాజశ్రీ

● తిరుమలాయపాలెం: ఉత్తమ ప్రతిభతో ఆయా సబ్జెక్టుల్లో మంచి ఫలితాల సాధనకు కృషి చేసిన ఉత్తమ ఉపాధ్యాయులకు శనివారం జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. ఈనేపథ్యాన తిరుమలాయపాలెం మండలంలో ఉత్తమ ప్రధానోపాధ్యాయులుగా జల్లెపల్లి, తెట్టెలపాడు జిల్లా పరిషత్ పాఠశాలల హెచ్‌ఎంలు దారా రాజేష్, శ్రీనివాసరావులు ఎంపికయ్యారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా జల్లెపల్లి పాఠశాల ఉపాధ్యాయులు గంగవరపు పార్థసారథి(ఇంగ్లిష్), ఆకారపు సునీత(ఫిజిక్స్), ఇనపనూరి రంజిత్‌కుమార్(జీవశాస్త్రం), మరికంటి సురేష్(సాంఘికశాస్త్రం), పిండిప్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన చింతపల్లి రాజశ్రీ(తెలుగు) కాకరవాయి పాఠశాలకు చెందిన ఎం.రామారావు(గణితం), సహీనాసుల్తానా(హిందీ), విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌లో ఏనెకుంటతండా ఉపాధ్యాయుడు హిమకర్ కృష్ణలను ఎంపిక చేసి సన్మానించారు. ప్రతిభ కనబర్చిన ఉపాధ్యాయులను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు అభినందించారు.

● కూసుమంచి: కూసుమంచి ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 43 నుంచి 120మందికి పెంచి క్రమశిక్షణ ఇచ్చిన పాఠశాల హెచ్‌ఎం హెచ్‌ఎం తేజావత్ భాస్కర్‌ను అదనపు కలెక్టర్‌లు శ్రీనివాసరెడ్డి, శ్రీజ సత్కరించి మెమెంటో అందజేశారు.



భాస్కర్‌ను సత్కరిస్తున్న అదనపు కలెక్టర్లు

● రఘునాథపాలెం: మండలంలో పదో తరగతిలో



సన్మానం పొందుతున్న రఘునాథపాలెం పాఠశాల హెచ్‌ఎం వెంకటేశ్వర్లు

అత్యధిక మార్కులు సాధించేలా చేసిన రఘునాథపాలెం పాఠశాల హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, వందశాతం ఫలితాలు సాధించిన కోయచలక పాఠశాల హెచ్‌ఎం శిరీషలను అదనపు కలెక్టర్లు సన్మానించారు. వీరిని మండల విద్యాశాఖ అధికారి రాములు ప్రత్యేకంగా అభినందించారు.

● కామేపల్లి: మండలంలోని పాతలింగాల



ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న గుగులోత్ ధర్మానాయక్

హైస్కూల్‌లో సాంఘికశాస్త్రం, గణిత శాస్త్రం ఉపాధ్యాయులుగా పని చేస్తున్న గుగులోత్ ధర్మానాయక్, సంతోషరాజులను కలెక్టరేట్‌లో ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి, అడిషినల్ కలెక్టర్లు ప్రశంస పత్రాన్ని అందించి సత్కరించారు.



ప్రశంసాపత్రం చూపిస్తున్న ఉపాధ్యాయుడు సంతోషరాజు

శతాధిక వృద్ధుడి మృతి

ఖమ్మంఅర్బన్: నగరంలోని ఇందిరానగర్‌కు చెందిన శతాధిక వృద్ధుడు నాళ్ల ముత్యమయ్య (103) శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. తల్లాడ మండలంలోని కుర్నవల్లి గ్రామానికి చెందిన ఆయన గత పదిహేనేళ్లుగా ఖమ్మంలో కుమారుల వద్ద ఉంటున్నాడు. రెండేళ్ల క్రితం భార్య మరణించగా, ఇతనికి ముగ్గురు కుమారులు, ఆరుగురు కుమార్తెలు ఉన్నారు.

అనారోగ్యంతో గ్రామ సహాయకుడు..

కామేపల్లి: మండలంలోని పొన్నేకల్ గ్రామానికి చెందిన గ్రామ సహాయకుడు(వీఆర్ఏ) మాల పోలు వీరస్వామి(69) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. దీంతో ఆయన మృతదేహాన్ని తహసీల్దార్ సుధాకర్, ఆర్‌ఐ విజయకుమారి సందర్శించి నివాళులర్పించారు. దహన సంస్కారాల నిమిత్తం తక్షణ సాయం కింద రూ.10 వేల నగదు బాధిత కుటుంబానికి అందించారు.

రాళ్లబంధం వాగును పట్టించుకోండి



వాగును పరిశీలిస్తున్న సీపీఐ ప్రతినిధులు

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాధారం-మంగాపురంతండా గ్రామాల మధ్య ఉన్న రాళ్లబంధం వాగును పట్టించుకోవాలని సీపీఐ పాలేరు డివిజన్ నాయకుడు పొట్టీయ శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శనివారం రాళ్లబంధం వాగును పార్టీ ప్రతినిధులు సందర్శించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. వర్షాకాలం వస్తే రాళ్లబంధం వాగు పొంగి చప్టా తెగిపోతుందని, ఫలితంగా చెరువుమాధారం, మంగాపురం, వల్లభి, రాయగూడెం తదితర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయన్నారు. 2023లో నాటి ప్రభుత్వం రూ.25లక్షలతో పనులు చేపట్టేందుకు శంకుస్థాపన చేసి చేతులు దులుపుకున్నారని అన్నారు. వాగు ఇబ్బందులు లేకుండా శాశ్వత పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు భూక్యా రాములు, గుగులోత్ వెంకటేశ్వర్లు, పగిడిపత్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల బలోపేతంపై దృష్టి



చికిత్స కోసం వచ్చిన వారితో మాట్లాడుతున్న కలెక్టర్



ఖిల్లా ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అనుదీప్, అధికారులు

ఖమ్మంవైద్యవిభాగం: పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను మరింత బలోపేతం చేయడంపై దృష్టి సారించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. ఖమ్మం ముస్తఫానగర్‌లోని పట్టణ ఆర్యోగ కేంద్రా(యూహెచ్‌సీ)న్ని శనివారం తనిఖీ చేసిన ఆయన ఓపీ, ఐపీ సేవలు, డ్రగ్ స్టోర్‌ను పరిశీలించి అందుతున్న సేవలు, మందుల లభ్యతపై ఆరా తీశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ యూహెచ్‌సీల్లో మెరుగైన వైద్యసేవలు అందించడం ద్వారా జిల్లా ఆస్పత్రిపై భారం తగ్గుతుందని తెలిపారు. మందుల కొరత రాకుండా చూస్తూ ఏఎన్‌ఎంలే, ఆశాల కొరత రానివ్వొద్దని.. వైద్య సేవలు అందుబాటులో లేని ప్రాంతాల్లోకొత్త కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. అనంతరం చికిత్స కోసం వచ్చిన వారితో కలెక్టర్ మాట్లాడి సేవల వివరాలు తెలుసుకున్నారు. వైద్యాధికారి డాక్టర్ కె.రమేష్, ఉద్యోగులు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళిక

ఖమ్మంస్పోర్ట్స్: జిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేసేలా ప్రణాళికాయుతంగా ముందుకు సాగుతున్నట్లు కలెక్టర్ అనుదీప్ తెలిపారు. ఖిల్లా వద్ద రోప్ వే నిర్మాణ ప్రాంతం, జాఫర్ బావి సుందరీకరణ పనులను కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి ఆయన పరిశీలించారు. రూ.29కోట్ల వ్యయంతో చేపట్టే రోప్ వే నిర్మాణం త్వరగా మొదలుపెట్టాలని అధికారులకు సూచించారు. అలాగే, జాఫర్ బావి సందర్శనకు పర్యాటకులు వచ్చేలా ఆకర్షణీయమైన లైటింగ్ ఏర్పాటు చేయాలని తెలిపారు. ఆర్డీఓ నర్సింహారావు, జిల్లా పర్యాటక అభివృద్ధి అధికారి సుమన్ చక్రవర్తి, కేఎంసీ సహాయ కమిషనర్ అనిల్ కుమార్, తహసీల్దార్ సైదులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్‌లో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్ టోర్నీలో జిల్లా క్రీడాకారులకు ఓవరాల్ చాంపియన్‌షిప్ దక్కించుకున్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను కలెక్టర్ అనుదీప్ అభినందించారు. డీవైఎస్ఓ సునీల్ రెడ్డి, అథ్లెటిక్స్ అకాడమీ చీఫ్ కోచ్ ఎం.డీ.గౌస్, అథ్లెటిక్స్ అసోసియేషన్ బాధ్యులు మందుల వెంకటేశ్వర్లు, ఎం.డీ.షఫీక్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

● కల్వర్టు.. కూలేట్టు!



ఖమ్మం నగరం 13వ డివిజన్ శ్రీనగర్ కాలనీ మూడో లైన్‌లోని లింకు రోడ్డు జంక్షన్ వద్ద ఉన్న కల్వర్టు స్లాబ్ ప్రమాదకరంగా మారింది. సిమెంట్ రాలి ఇనుప రాడ్లు బయటకు కన్పిస్తున్నాయి. ఇక రాత్రి సమయాన ఏం ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు మేల్కొని వెంటనే మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు రోడ్డును ఆనుకుని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో ప్రమాదాన్ని పిలుస్తున్న కల్వర్టుగా మారిందని చెబుతున్నారు.

– ఖమ్మంఅర్బన్